క్లుప్తంగా

సోలార్ ప్లాంట్లకు సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగరాజు

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు చేపట్టే సర్వే కార్యక్రమానికి సహకరించాలని కమిషనర్ బి.నాగరాజు కోరారు. ఈ మేరకు మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం ఆయన స్థానిక విద్యుత్ శాఖ, మున్సిపాలిటీ సిబ్బందితో సోలార్ పరికరాల ఏర్పాటుపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యాలయ భవనంపై సోలార్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందని అన్నారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకట రత్నం, సబ్ ఇంజనీర్ శివ శంకర్, జేఏఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు వనవాసి కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. చర్ల మండలానికి సోయం భవ్య శ్రీ, భాను శ్రీలకు తండ్రి లేకపోవడంతో చదువుకు దూరంగా ఉండగా.. వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో చేర్చారు. వారి చదువుకు అయ్యే ఖర్చును ప్రతి ఏటా హైదరాబాద్‌కు చెందిన తుమ్మలపల్లి స్ఫూర్తి అందజేస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏదాది ఆర్థిక సహాం బుధవారం పాఠశాల హెచ్ఎమ్ గీతమాతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వనవాసీ కళ్యాణ పరిషత్ జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, పెద్దాడ ఆశాలత, కడాలి నాగరాజు పాల్గొన్నారు.

గుంతల వద్ద ఆందోళన

బూర్గంపాడు: సారపాకలోని అంతర్గత రహదారుల దుస్థితిపై బుధవారం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సారపాకలోని మసీద్‌రోడ్‌లోని గుంతల వద్ద నాయకులు ఆందోళన చేపట్టారు. అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయని, సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగుల వెంకటరెడ్డి, బెజ్జంకి కనకాచారి, కేసగాని శ్రీనివాస్, సోము లక్ష్మి చైతన్యరెడ్డి, ఆంజనేయులు, దుప్పటి సురేష్, చుక్కపల్లి బాలాజీ పాల్గొన్నారు.

విహార యాత్రలతో విజ్ఞానం

భద్రాచలంటౌన్: విద్యార్థులకు విహార యాత్రలతో చదువుతోపాటు విజ్ఞానం, మేధాశక్తిని పెంపొందుతుందని ఐటీడీఏ డీడీ మణెమ్మ అన్నారు. సత్తుపల్లి జేవీఆర్ కళాశాల విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం, ఐటీడీఏతో పాటు గిరిజన మ్యూజియంలను బుధవారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు గిరిజన మ్యూజియంలో పాత తరంకు సంబంధించిన కళాఖండాలు, ఆచార వ్యవహారాలు సాంస్కృతి సాంప్రదాయాలు కట్టుబాట్లు గురించి వివరించడం జరిగిందని అన్నారు. కళాశాల అధ్యాపకురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు యూనిఫాం, షూస్, టై-బెల్ట్‌లను మణుగూరు ఎంఈఓ స్వర్ణజ్యోతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఎంఈఓను పూర్వ విద్యార్థులు శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఆంగ్ల ఉపాధ్యాయుడు షేక్ మీరాహుస్సేన్, పూర్వ విద్యార్థులు శుద్దపల్లి చెన్నారెడ్డి, పులిగిల్ల రమేష్, కామసాని వీరమధుసూధన్‌రెడ్డి, భీమరాజు కార్తీక్, రాసాల రమేష్, షేక్ కాజామియా, జానీ పాల్గొన్నారు.

'పీఎం శ్రీ'ని అంగన్‌వాడీల్లోనే అమలు చేయాలి

చర్ల: పీఎంశ్రీ పథకంలో భాగంగా ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే కొనసాగించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మచారి, సీఐటీయూ (అంగన్‌వాడీ), జిల్లా కార్యదర్శి పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చర్ల ప్రాజెక్టు నాలుగో మహాసభ కలివేరు రైతు వేదికలో ప్రాజెక్టు నాయకురాలు జెస్సీరూప అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా బ్రహ్మచారి మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయడం కోసమే పీఎం శ్రీ పేరుతో ప్రైమరీ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. మహాసభలో సీఐటీయూ మండల కన్వీనర్ పాయం రాధాకుమారి, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు నాయకులు పాలెం నాగమణి, జయసుధ, త్రివేణి, పుష్ప, సరిత, లక్ష్మి, లలిత, నాగమణి, పద్మ, ధర్మాదేవి, సావిత్రి, అనసూర్య పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు..

- శిథిలావస్థకు చేరుకుంటున్న అటవీశాఖ క్వార్టర్లు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ప్రాంతాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



దానవాయిపేటలో పిచ్చి చెట్ల మధ్య అటవీశాఖ క్వార్టర్



కొత్తూరులో నిరుపయోగంగా ఉన్న క్వార్టర్

చర్ల: మండలంలోని చర్ల, దుమ్ముగూడెం ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలో ఉన్న గ్రామాల్లో కొంత కాలం క్రితం క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్లను నిర్లక్ష్యంగా వదిలేశారు. ఆ క్వార్టర్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ క్వార్టర్లను అటవీశాఖ గాలికొదిలేయడంతో అవి ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి.

దట్టమైన పిచ్చి మొక్కలు..

చర్ల మండలంలోని బీ కొత్తూరు, దానవాయిపేట, దేవరాపల్లి గ్రామాల్లో సుమారు 15 యేళ్ల క్రితం క్షేత్రస్థాయిలో పని చేసే బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు స్థానికంగా ఉండి విధులు నిర్వహించేందుకు అటవీ ప్రాంతాల నుంచి మైదాన ప్రాంతాలకు వచ్చే ప్రధాన రహదార్లలో క్వార్టర్లను నియమించారు. అయితే వీటిలో తొలత సిబ్బంది నివాస మున్నప్పటికీ అటు తరువాత వాటిని ఖాళీ చేసి వారు భద్రాచలం, చర్ల ప్రాంతాలకు మకాం మార్చారు. ఆయా ప్రాంతాల నుంచి రాకపోకలను సాగిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ఉన్న క్వార్టర్లు మందుబాబులు, పేకాట రాయుళ్లు, ఇతర జూదరులు వాటిని అడ్డాలుగా చేసుకున్నారు. నిత్యం వాటిల్లో మందు పార్టీలు చేసుకోవడం, పేకాట ఆడడం వంటి కార్యకలాపలతో నిండిపోయాయి. దీంతోపాటు ఆ క్వార్టర్ల చుట్టూ పిచ్చి మొక్కలు, చెట్లు మొలవడంతో అవి అడవులను తలపించే విధంగా తయారయ్యాయి. జూదరులకు ఇది మరింతగా కలిసొచ్చింది.

పట్టింపులేని అధికారులు

లక్షలాది రూపాయలను వెచ్చించి నిర్మించిన ఈ నిర్మాణాలను ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకుండా పోవడంతో.. ఇక వాటిల్లో ఉండాల్సిన సిబ్బంది కనీసం వాటి వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి.. ఆయా భవనాలకు మరమ్మతులు చేయిస్తే అన్నీ క్వార్టర్లు వినియోగంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. తద్వారా క్షేత్రస్థాయి సిబ్బందిని ఆయా క్వార్టర్లలోనే నివాసం ఉండేలా ఆదేశాలిస్తే అవి పాడవ్వకుండా ఉంటాయి. దీంతోపాటు ఆయా గ్రామాల మీదుగా సాగే అక్రమ కలప రవాణాను కూడా పూర్తిగా నియంత్రించవచ్చు.

మరమ్మతులు చేయించి కేటాయించాలి



లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన అటవీశాఖ క్వార్టర్లు నిర్లక్ష్యంగా వదిలేవడం సరికాదు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి వాటికి మరమ్మతులు చేయించి క్షేత్రస్థాయిలో విధుల్లో ఉండే సిబ్బందికి కేటాయించాలి. ఏళ్ల తరబడిగా అవి నిరాధరణకు గురవ్వడంతో ప్రభుత్వ ధనం వృథాగా మారుతోంది.

– కనితి రజిని, దానవాయిపేట

జూదరులకు అడ్డాగా మారుతున్నాయి..



మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మించి నిరుపయోగంగా వదిలేసిన అటవీశాఖ క్వార్టర్లు జూదరులకు అడ్డాలుగా మారుతున్నాయి. వాటిలో మందుబాబులు చేరి మద్యం సేవిస్తుండడం, పేకాట ఆడడంతో పాటు ఇతర అసాంఘిక కార్యాకలాపాలు చేపడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి వినియోగంలోకి తీసుకురావాలి.

– ఎం.విజయరాజు, ఆర్ కొత్తగూడెం

సీసీరోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే



బూర్గంపాడు: బత్తులనగర్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: మండల పరిధిలోని బత్తుల నగర్, చెరువుసింగారం, కృష్ణసాగర్, సండెళ్లరామాపురం గ్రామాలలో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, పీఆర్ డీఈవె వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ్‌గాంధీ, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని సీతరాంపురం, నెల్లిపాక గ్రామ పంచాయతీలలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మణిధర్, ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, ఎంపీఓ ముత్యాలరావు, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ చక్రధరాచారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

మణుగూరుటౌన్: ప్రజాభవన్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం పట్టాలు అందజేశారు. పట్టాలు అందుకున్న లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వేగంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేశ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, ప్రభుత్వ అధికారులు, మండల అధ్యక్షుడు నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ సైదులు, కూచిపూడిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఏరియా ఉత్తమ కార్మికులు వీరే..

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో విధులు నిర్వర్తిస్తువారిలో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసినట్లు డీజీఎం(పర్సనల్) సలగల రమేశ్ బుధవారం తెలిపారు. కార్పొరేట్ స్థాయి ఉత్తమ ఉద్యోగిగా అన్న ఆంజనేయులు (ఈపీ ఆపరేటర్, ఓసీ-2), ఏరియాస్థాయి ఉత్తమ ఉద్యోగులుగా గొర్ల శ్రీనివాస్ ఈపీ ఆపరేటర్(ఓసీ-2), షేక్ యాకూబ్ పాషా(జనరల్ అసిస్టెంట్ పీకేఓసీ-2), విజయకృష్ణ, (సీనియర్ అసిస్టెంట్ పీకేఓసీ-4), సుదర్శనం (ఈపీ ఆపరేటర్ మణుగూరు ఓసీ), సలీం పాషా (వెల్డర్, మణుగూరు ఓసీ), వసంత రావు (కేపీయూజీ), నర్సయ్య (జనరల్ అసిస్టెంట్ కేసీహెచ్‌పీ), మనోహర (జూనియర్ అసిస్టెంట్ జీఎం కార్యాలయం), దశరథం(ఎస్అండ్‌పీసీ) ఎంపికైనట్లు వెల్లడించారు. వీరికి శుక్రవారం ఉదయం పీవీకాలనీలోని కమ్యూనిటీహాల్ ప్రాంగణంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఏరియా జీఎం దుర్గం రాంచందర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించి సత్కరించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉత్తమ ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగి అన్న ఆంజనేయులుకు కొత్తగూడెంలో జరిగే ప్రధాన వేడుకల్లో సీఅండ్ఎండీ బలరాం నాయక్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం, సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు.

గురుకులంలో ఎమ్మెల్యే తనిఖీ



దమ్మపేట: గురుకులంలో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే జారె

దమ్మపేట: మండల పరిధిలోని అంకంపాలెం బాలికల గిరిజన గురుకుల కళాశాలలో.. స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి, మౌలిక వసతులు, నాణ్యతలో కూడిన మెనూ అమలు చేయడం తదితర వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలను, స్టోర్ రూంలోని కూరగాయలను తనిఖీ చేయగా.. నాణ్యత లోపించడంతో బాధ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోమారు ఇలాంటి చర్యలు పునరావృతం అయితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పునాది స్థాయిలోనే ఆత్మవిశ్వాసాన్ని నింపాలి

అశ్వారావుపేటరూరల్: లక్ష్యసాధన కోసం విద్యార్థులకు పునాదిస్థాయిలోనే ఆత్మ విశ్వాసాన్ని నింపాల్సిన అవసరం ఉందని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. బుధవారం మండలంలోని సున్నంబట్టి, అనంతారం, కావడిగుండ్ల గ్రామాల్లోగల ఐటీడీఏ గిరిజన ఉన్నత ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అందించే లక్ష్యంగా ఇగ్నైట్ అండ్ ఇన్‌స్పైర్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అందుకునేందుకు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకంగా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే కార్యక్రమాలను చేపట్టుతున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో తెలంగాణ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, ఏటీడబ్ల్యూఓ చంద్రమోహన్, ఎంఈఓ పొన్నగంటి ప్రసాదరావు, ఐటీడీఏ ఏఈఈ ప్రసాద్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, వార్డెన్లు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

దమ్మపేట: ఏపీ నుంచి అక్రమంగా ఇసుక తీసుకొస్తున్న టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఏపీలోని రాజమండ్రి నుంచి వస్తున్న టిప్పర్‌ను బుధవారం మండలంలోని అల్లిపల్లి చెక్ పోస్ట్ వద్ద సీజ్ చేయడమే కాక బాధ్యులపై కేసు నమోదు చేశామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

సీపీఎం నాయకుడికి పరామర్శ

ములకలపల్లి: సీపీఎం మండల నాయకుడు, సొసైటీ డైరెక్టర్ ఊకంటి రవి తల్లి ఊకంటి ప్రమీలాదేవి (75) మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రమీల.. చికిత్స పొందుతూ బుధవారం మాధారంలో స్వగృహంలో చనిపోయారు. కాగా వివిధ పార్టీలకు చెందిన మండల బాధ్యులు, నాయకులు ప్రమీల మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

కాంగ్రెస్ శ్రేణుల సమావేశం

దమ్మపేట: మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్దిశెట్టి సత్య ప్రసాద్ అధ్యక్షతన ఆ పార్టీ గ్రామ శాఖ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సత్య ప్రసాద్ మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పర్వతనేని ప్రసాదు, సాయిల నర్సి, చిలకా శ్రీను, ఆకుల కృష్ణారావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

రేపు విగ్రహావిష్కరణ

మణుగూరురూరల్: మండల పరిధిలోని చిక్కుడుగుంట గ్రామంలో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఎదుట ఈ నెల 15వ తేదీన మన్యం వీరుడు కొమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు జాతీయ ఆదివాసీ(గిరిజన) అభ్యుదయ సంఘం నాయకులు తెలిపారు. బుధవారం పట్టణంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మధ్యాహ్నం 2గంటలకు మంత్రి సీతక్క చేతుల ఆవిష్కరించనున్న ఈ కార్యక్రమాలనికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు కుంజా వెంకటరమణ, పాడెం నరసమ్మ, కుంజా ఆదిలక్ష్మి, పూనెం విజయలక్ష్మి, ఏనిక మంగమ్మ, ఏనిక రజిని, మడకం లక్ష్మి, కౌసల్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారం గ్రామపంచాయతీ బోడిపూడినగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి బోడేపూడినగర్‌లో పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు తోట పద్మ, కతిజాబేగం, ప్రసాద్‌బాబు, గ్రామస్తులు ఎం.జ్యోతి, పద్మ, సరస్వతి, కృష్ణవేణి, స్వర్ణ, విమల, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ జన్మదిన వేడుకలు

మణుగూరుటౌన్: మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుక చౌదరి 70వ జన్మదిన వేడుకలు మణుగూరులో ఘనంగా నిర్వహించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురిజాల గోపి ఆధ్వర్యంలో రేణుక అక్షర మండలి కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ప్రజలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించి నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నాయకులు షరీఫ్, అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ, షబానా, శ్యామల చక్రి, రేణుక, కిషన్ నాయక్, శేఖర్, సాయి, బాబు పాల్గొన్నారు.

సభలను విజయవంతం చేయండి

చర్ల: ఈ నెల 19 నుంచి 22 వరకు మేడ్చెల్‌లో జరిగే సీపీఐ పార్టీ రాష్ట్ర 4వ మహాసభలకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు, డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వారవు పిలుపునిచ్చారు. బుధవారం చర్లలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ మండల కార్దయర్శి నూపా పోతయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలోపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మండల సహాయ కార్యదర్శి చల్లా లక్ష్మీ నారాయణ, కోటి ముత్యాలరావు, కార్యవర్గ సభ్యులు ఉప్పులూరి నాగరాజు, కోడిరెక్కల రాజారావు, ఆండ్ర వామనరావు, తోటా శ్రీనివాసరావు, పాలచ రామారావు, పాలెం సత్యనారాయణ, నూపా తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సభలు..

ములకలపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల మూడో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు, తెలంగాణా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు చిక్కుల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండలవ్యాప్తంగా కరపత్రాలు పంచి, విస్తృతంగా ప్రచారం చేశారు. ములకలపల్లిలోని ఫంక్షన్ హాల్‌లో 19న నిర్వహించనున్న సభకు భారీగా తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. వాడే భుజంగరావు, పూనెం వీరభద్రం, వగ్గెల దారయ్య, కుంజా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన

కార్మికులు, రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోందని, మోదీ మెతక వైఖరి కారణంగానే ట్రంప్ భారీగా సుంకాలను విధించాడని వామపక్ష పార్టీల అనుబంధ వ్యవసాయ, కార్మిక సంఘ నాయకులు విమర్శించారు. ఈ మేరకు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ర్యాలీలు చేపట్టి, కేంద్ర ప్రభుత్వం, ట్రంప్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్పొరేట్లకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దుచేయాలని, అమెరికాతో ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



దమ్మపేట: కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కిసాన్ మోర్చా నాయకులు



బూర్గంపాడు: ఆందోళన చేస్తున్న వామపక్ష ప్రజాసంఘాల నాయకులు



ములకలపల్లి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వ్యవసాయ సంఘం, రైతు కూలి సంఘం నాయకులు



చండ్రుగొండ: ప్రధాన సెంటర్‌లో మోదీ దిష్టిబొమ్మతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



చర్ల: మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

యూరియా కోసం పడిగాపులు



నెల్లిపాక పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో బుధవారం యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. రైతులు వారి కుటుంబ సభ్యులు యూరియా కోసం క్యూలో ఉన్నారు. ఒక్కో రైతుకు రెండు యూరియా బస్తాలు మాత్రమే ఇస్తుండటంతో రైతులు యూరియా సరిపోక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సరిపడా యూరియా అందించాలని రైతులు కోరుతున్నారు.

శ్మశానవాటిక లేక అవస్థలు

అశ్వాపురం: మండల పరిధిలోని అమెర్ద కాలనీకి సరైన శ్మశాన వాటకలేక అవస్థలు పడుతున్నారు. గతంలో పాత ఆమెర్దకు వెళ్లే దారిలో శ్మశానవాటిక ఉండగా సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌లో పోయింది. గ్రామస్తులు అధికారులకు పదే పదే మొరపెట్టుకోగా సంద్రలబోడు గ్రామానికి వెళ్లే దారిలో గుట్ట పక్కన స్థలం కేటాయించారు. కాని అది శ్మశాన వాటికకు అనువైన స్థలం కాకపోవడంతో తంటాలు పడుతున్నారు. తాజాగా గ్రామానికి చెందిన బర్ల వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మరణించగా.. అతని అంతిమ సంస్కారాలకు శ్మశానంలో గుంత తవ్వేందుకు స్థానికులు నానా అవస్థలు పడ్డారు. గుట్ట స్థలంలో గుంత తవ్వాలంటే బతికున్నోళ్లం నరకం చూస్తున్నామని స్థానికులు చెబుతున్నారు. జేసీబీతోనే గొయ్యి తీయాల్సిన పరిస్థితి ఉందని, నిరుపేదలకు జేసీబీకి డబ్బులు ఎలా ఉంటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ములకలపల్లి: ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి వర్కా అజిత్ పాల్గొని పతాకాన్ని ఆవిష్కరించారు. సంఘ జిల్లా సమితి సభ్యుడు రాజ్‌కమల్, అభిలాష్, బన్నీ, వంశీకల్యాణ్, చంద్రలేఖ, మహేశ్వరి పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం అశ్వారావుపేటలోగల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. సంఘం పట్టణ కార్యదర్శి నూకవరపు విజయకాంత్ చేతుల మీదుగా అరుణ పతకాన్ని ఎగుర వేశారు. జిల్లా కార్యదర్శి వరక అజిత్, సంఘం సభ్యులు రాజ్ కమల్, ఎస్‌కె రజ్వి పాల్గొన్నారు.

రహదారిపై నాట్లు వేసి నిరసన



రహదారిపై నాట్లు వేస్తున్న సీపీఎం నాయకులు

దుమ్ముగూడెం: లారీల వల్ల దెబ్బతిన్న ములకపాడు ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గోతిలో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదివాసీ ఐక్య కార్యచరణ కమిటీ గౌరవ అధ్యక్షుడు కొమరం దామోదర్ రావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా జాయింట్ సెక్రెటరీ మల్లు దొర పాల్గొని సంఘీభావం తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడుతూ.. దెబ్బతిన్న భద్రాచలం-చర్ల ప్రధాన రోడ్డును వెంటనే బాగు చేయించాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, సొసైటీ డైరెక్టర్ ఎలమంచి శ్రీనుబాబు, బొల్లి సత్యనారాయణ, సరియం కోటేశ్వరావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నషా ముక్తి భారత్ అభియాన్ ప్రోగ్రాంను పురస్కరించుకుని పలు చోట్ల బుధవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై కార్యక్రమాలు చేపట్టారు. విద్యాసంస్థల్లో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పోలీసులు మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాటికి దూరంగా ఉండాలని సూచిస్తూ.. ఆ మేరకు ప్రతిజ్ఞ చేయించారు. ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పలువురు అధికారులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



దుమ్ముగూడెం: విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ అశోక్, ఎస్ఐ గణేష్‌లు



అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



అన్నపురెడ్డిపల్లి: మత్తుకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



భద్రాచలంఅర్బన్: ఆర్టీసీ డిపోలో ప్రయాణికులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎం తిరుపతి



ములకలపల్లి: విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న జూనియర్ కళాశాల అధ్యాపకులు